ప్రజాశక్తి

సోమవారం 8 ఏప్రిల్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



15 నుంచి సముద్రంలో

వేట నిషేధం

బాపట్ల మత్స్యశాఖ అధికారి రవీంద్ర

ప్రజాశక్తి-బాపట్ల

సముద్ర జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధం కొనసాగుతుందని బాపట్ల మత్స్యశాఖ అధికారి రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. యాంత్రిక పడవలు, మేకనైజ్డ్, మోటారు బోట్ల ద్వారా జరిగే అన్ని రకాల చేపల వేటను 61 రోజుల పాటు ప్రభుత్వం నిషేధించిందని పేర్కొన్నారు. చేపల పునరుత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా మత్స్య సంపదను మరింత పెంపొందించేందుకు ఈ నిషేధం విధించినట్లు తెలిపారు. ఈ మేరకు మత్స్యకారులు సహకరించాలని కోరారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించిన బోట్ల యజమానులకు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టాన్ని అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకొని జరిమానా విధిస్తారని తెలిపారు. చేపలవేట నిషేధం సక్రమంగా అమలయ్యేందుకు మత్స్య శాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ నిర్వహిస్తామని తెలిపారు.

మీరు ఏ దారిలో నడవాలో..

నిర్ణయించేది మీ ఓటే..

- అదే బడ్జెట్, అదే రాష్ట్రం.. చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడు?
- రైతు రాజ్యాన్ని ధ్వంసం చేసేందుకే కూటమి వస్తోంది..
- కొనకనమిట్ల బహిరంగ సభలో సిఎం జగన్


ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, కొనకనమిట్ల

'ఇది జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న యుద్ధం కాదు.. ఇది పేదలకు, మోసాలకు మధ్య జరిగే ఎన్నిక, మీ బిడ్డ జగన్ పేదల పక్షం.. కాబట్టి ప్రతి ఓటూ మీ కుటుంబమంతా వచ్చే ఐదేళ్లు ఏ దారిలో నడవాలో నిర్ణయిస్తుంది. ఈ ఐదేళ్లలో జరిగిన సంక్షేమం కొనసాగాలంటే జగన్‌కి ఓటు వేయాలి.. రద్దు చేయాలనుకుంటే చంద్రబాబుకు వేయాలి' అని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

మేమంతా సిద్ధం ▶ 2లో



ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్



సిఎం జగన్‌కు క్రేన్ల సాయంతో భారీ గజమాలలు వేస్తున్న వైసిపి నాయకులు, అభిమానులు



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

టిడిపి హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

ఒంగోలు అభ్యర్థి దామచర్ల

8లో ▲



సొత్తును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రూ.9 లక్షల సొత్తు స్వాధీనం

బంగారం, వెండిని పట్టుకున్న పోలీసులు

8లో ▲

మౌలిక వసతుల కల్పనలో విఫలం

- అభివృద్ధి చేసే కాంగ్రెస్‌కు పట్టం కట్టండి
- ఒంగోలు అభ్యర్థి బిఆర్ గౌస్
- త్రోవగుంటలో ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రస్తుతం ఒంగోలు నగరంలో 1.50 లక్షలకు పైగా ప్రజలు నివసిస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనలో గత ప్రభుత్వం, ప్రస్తుత ఎమ్మెల్యే విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బిఆర్ గౌస్ విమర్శించారు. దేశాన్ని అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీకే రానున్న సార్వత్రిక ఎన్నికలలో పట్టం కట్టాలని కోరారు. నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలోని త్రోవగుంట నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారాన్ని ప్రారంభించారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, న్యాయవాది షేక్ సంధాని ఆధ్వర్యంలో ఈ ప్రచారాన్ని బిఆర్ గౌస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్ గౌస్ మాట్లాడుతూ గడిచిన 20 సంవత్సరాల నుండి రాజకీయాలను, ఒంగోలు నగర ప్రజల అవసరాలను దగ్గర నుండి గమనిస్తున్నానన్నారు. ఒంగోలు నగరంలో 75 వేల మంది ప్రజలకు అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు లాంటి సదుపాయాలు మాత్రమే ఉన్నాయన్నారు. రాబోయే వేసవిలో ప్రజలు రికార్డు స్థాయిలో తాగు నీటి కోసం ఇబ్బంది పడవలసిన పరిస్థితిని కల్పించారని, ఇటువంటి పాలకులను తిరస్కరించి రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయ డం ద్వారా దేశంలో, రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డి, పిసిసి ఉపా ధ్యక్షులు శ్రీపతి ప్రకాశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, కరిముల్లా ఖాన్, పిసిసి అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి, యువజన కాంగ్రెస్ నాయకులు బండి కిషోర్, షేక్ సుభాన్, దండుప్రోలు ప్రసాద్, రాయపాటి గిడ్యోన్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, పాత నేరస్తులు

సత్ప్రవర్తనతో మెలగాలి

- అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొంటే కఠినచర్యలు
- ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రౌడీషీటర్లు, పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు వారి స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న రౌడీషీటర్లు, పాతనేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ గతంలో చేసిన తప్పులను తెలుసుకొని, తిరిగి అటువంటి నేరాలు మరలా పునరావతం కాకుండా, సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారుల సూచనలు పెడచెవిన పెట్టి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్న, ఎన్నికల నియమావళిని అతిక్రమించిన అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీస్ అధికారులు వారి పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం వుండే పాతనేరస్తులు, రౌడీ షీటర్స్‌పై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ అధికారులు వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం వుంటున్న రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రస్తుత జీవన విధానం, వారు చేస్తున్న వత్తి, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకొని, రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు.

బిజెపికి తొత్తు పార్టీలను ఓడించండి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి ● జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టి బిజెపికి వంత పాడుతున్న పార్టీలను ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ఏపీ గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి వృత్తిదారులకు పిలుపునిచ్చారు. ఒంగోలు ప్రజాసంఘాల కార్యాలయం ఎల్‌బిజి భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షులు కండే బాలకృష్ణ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతూ దేశ సంపదను దోచుకుంటున్న బిజెపి ప్రభుత్వానికి మద్దతు పలికిన టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించి ఎన్నికల్లో ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపిని ఓడించాలని అన్నారు. రాష్ట్రంలో గ్యాస్, విద్యుత్ చార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను పెంపు పాపం బిజెపి, వైసిపి ప్రభుత్వాలదేనన్నారు. బిజెపితో జతకట్టిన తెలుగుదేశం, జనసేనలు ఈ పాపంలో భాగస్వాములయ్యాయని అన్నారు. బిజెపి నమ్మకద్రోహాన్ని ఎదుర్కోవడానికి, రాష్ట్ర ప్రజావాణిని అసెంబ్లీలో వినిపించడానికి ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే వామపక్షాలను, ఇండియా వేదికను గెలిపించాలని వృత్తిదారులకు పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉండటం, సాగర్ నీళ్ల రాకపోవడంతో జీవాలు, పశువులకు స్థానికంగా మేత, నీళ్ల తగినంత దొరక్క అర్థాకలితో అలమటిస్తున్నాయన్నారు. దీంతో పెంపకందారులు కుటుంబాలను వదిలి సుదూర ప్రాంతాలకు వలసలు పోయి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చినా వీరిని పట్టించుకోవడం లేదన్నారు. వీరి కోసం కేటాయించిన పథకాలను రద్దు చేయడం దుర్మార్గమని విమర్శించారు. పశు నష్టపరిహారం పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్నికల పేరుతో గ్రామాలకు వస్తున్న నాయకులను వృత్తిదారుల వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న పార్టీలను నిలదీసి అడగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి శివయ్య, ఎన్ గంగరాజు, కె జయరాం, రమేష్, శివయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిలారి పెద్దబ్బాయి

మీరు ఏ దారిలో నడవాలో..
నిర్ణయించేది మీ ఓటే.!

(మొదటిపేజీ తరువాయి)

మేమంతా సిద్ధం బస్ యాత్రలో భాగంగా కొనకనమిట్లలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ అదే బడ్జెట్.. అదే రాష్ట్రం.. మీ బిడ్డ చేయగలిగింది చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడు? అని ప్రశ్నించారు. చంద్రబాబు మార్క్ అంటే అబద్ధాలు, కుట్రలు, మోసాలు అని, జగన్ మార్క్ అంటే ప్రతి గ్రామంలో కనిపించే అభివద్ధి అని తెలిపారు. ప్రజల రాజ్యాన్ని, రైతు రాజ్యాన్ని, మహిళల రాజ్యాన్ని, పిల్లల రాజ్యాన్ని ధ్వంసం చేసేందుకు వస్తున్న కూటమిని అడ్డుకునేందుకు మీరంతా సిద్ధమేనా! అని ప్రశ్నించారు. జరగబోయే ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు జరిగేవి కాదని, ఈ ఎన్నికలు పిల్లల వారి చదువు, అక్కచెల్లెమ్మల సాధికారత, రైతుల సంక్షేమం, పేద వర్గాలకు న్యాయం వంటివన్నీ కొనసాగించాలా.. లేదా.? వెనక్కి వెళ్లాలా.? అనే విషయాలపై జరిగేవని, మన భవిష్యత్తు ఎలా ఉంటుందో నిర్ణయించేదే మన ఓటేనని చెప్పారు. చంద్రబాబు ఇచ్చే రూ.వెయ్యి పింఛన్ కోసం క్యూలైన్లో నిలుచుని నరకయాతన పడిన రోజులు చూశామని, కానీ మీ బిడ్డ వాలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. ఈ వాలంటీర్ వ్యవస్థ చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోందన్నారు. అందుకే వారిపై ఫిర్యాదు చేసి, అవ్వతాతలను, దివ్యాంగులను ఇబ్బంది పెట్టి దాదాపు 30 మంది పై మరణానికి కారణమైన వ్యక్తిని శాడిస్ట్ అని కాకుండా ఇంకేం అంటారని ప్రశ్నించారు. మన ప్రభుత్వం వల్ల తనకి మేలు జరిగిందని చెప్పిన గీతాంజలిని సైకోలతో వేధించి ప్రాణం తీసిన పెద్ద శాడిస్టు చంద్రబాబు కన్నా ఇంకెవరుంటారని అన్నారు. చంద్రబాబు దోచుకోవటానికి, దోచుకున్న పంచుకోవటానికి అధికారాన్ని ఉపయోగించాడని, తేడా గమనించాలని,అదే బడ్జెట్, అదే రాష్ట్రం.. మీ బిడ్డ ఎలా చేయగలిగాడని, చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడని ప్రశ్నించారు. 2014లో ఇదే ముగ్గురు కూటమిగా ఏర్పడ్డారని, చంద్రబాబు, దత్తపుత్రుడు, మోదీ ఫోటోలతో ముఖ్యమైన హామీలూ అంటూ ప్రతి ఇంటికీ పంపించారని, 2014లో పంపించిన ముఖ్యమైన హామీల్లో ఒకటి రైతుల రుణమాఫీపై సంతకం చేస్తానన్నాడని, చేశాడా? అని ప్రశ్నించారు. రెండవది పొదుపు సంఘాల రుణమాఫీ చేస్తామని చెప్పాడని, చేశాడా? అని అడిగారు. గత పది రోజులుగా సీఎం జగన్ రాయలసీమ, ప్రకాశం జిల్లాలో పర్యటించారు. దీంతో మొత్తంగా ఇప్పటి వరకు 1000 కి.మీ.ల యాత్ర చేసినట్లయింది.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

బొడ్డువారిపాలెంలో నాగార్జున ప్రచారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని బొడ్డువారిపాలెం గ్రామంలో శనివారం రాత్రి గడపగడపకు మన నాగార్జున అన్న ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని వైసిపి సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి రాష్ట్ర మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున నిర్వహించారు. ముందుగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు ఆయన వివరించారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనను గెలిపించాలని, జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్య కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి ఎంపీపీ బి విజయ, గ్రామ సర్పంచ్ తానిపర్తి వెంకటరెడ్డి, చంద్రపాలెం సర్పంచ్ బొడ్డు రామారావు, మాజీ ఎంపీటీసి నల్లూరి భాస్కరరావు జేసీఎస్ కన్వీనర్ దమ్మాల శ్రీనివాసరావు, నాయకులు టి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో విశ్వాసాన్ని పెంపొందిస్తూ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పీర్లమాన్యం, అరుణోదయ కాలనీ, పేర్నమిట్ట ప్రాంతాలలో కేంద్ర పోలీసు బలగాలతో తాలూకా ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది పర్యటించారు. ముఖ్యమైన మార్గాల్లో తిరుగుతూ ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శక, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఎన్నికలను సజావుగా, సాఫీగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని వారు కోరారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో 'చదవటం మా కిష్టం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మొదటి ఆదివారం కావడంతో గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పి పేరయ్య, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్, గ్రంథాలయ సిబ్బంది ఎం శివకుమారి, ఎస్ అనిల్‌బాబు, సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.

మాచవరంలో 'మేరుగు' ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మద్దులూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బి మాచవరం గ్రామంలో ఆదివారం రాత్రి 'గడప గడపకూ మన నాగార్జున అన్న' ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున నిర్వహించారు. ఆయనకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. హారతులు ఇచ్చి పూలదండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతి వీధి తిరుగుతూ వైసిపికి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే వైసిపి అభ్యర్థుల్ని గెలిపించి జగన్మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, సీనియర్ నాయకులు బొల్లినేని కృష్ణయ్య, జెడ్పిటిసి దుంపా రమణమ్మ, జేసీఎస్ కన్వీనర్ దుంపా యలమందారెడ్డి, మద్దులూరు గ్రామ సర్పంచ్ మైనం శైలజ–అమరనాథ్, గ్రామ నాయకులు మొలకలపల్లి సీతమ్మ–వెంకటేశ్వరరావు, దాసరి కోటి, చీదెళ్ల అర్జున్–రేవతి, ప్రత్తిపాటి స్వాములు, నన్నూరి సింగయ్య, మద్దులూరు, మాచవరం గ్రామ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మంత్రి నాగార్జునకు పూలదండలు వేసి స్వాగతం పలుకుతున్న గ్రామ సర్పంచ్ శైలజా అమర్‌నాథ్..

ఘనంగా ఉగాది కవి సమ్మేళనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్థానిక ఒంగోలులోని రాజాపానగల్ రోడ్డులోని గౌతమ్ మోడల్ స్కూల్ ఆవరణలో కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. కళామిత్రమండలి (తెలుగు లోగిలి), నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త నిర్వహణలో ఉభయ సంస్థల అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సభకు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడారు. ముందుగా కప్పగంతు జయరామయ్య పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన కవులందర్నీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



సత్కారం పొందిన కవులు

నోటీసు

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

I.A . 274/2021
in
O.S. 59/21

Between
దగ్గుబాటి సుగుణ ..... పిటిషనర్/ వాది
V/s
యార్లగడ్డ శ్రీదేవి వగైరాలు ... రెస్పాండెంట్లు /ప్రతివాదులు

To
దగ్గుబాటి @ యార్లగడ్డ శ్రీదేవి @
సీతమ్మ, W/o తిరుపతయ్య చౌదరి,
R/o 7th లైన్, యజ్ఞశాలపేట, కారంచేడు గ్రామం,
కారంచేడు మండలం, పర్చూరు D.M.C.
బాపట్ల జిల్లా.

పై కోర్ట్ నందు పిటిషనరు పిటిషన్ పరిహారం నిమిత్తం, మీ పై పిటిషన్ దాఖలు చేయగా, సదరు పిటిషన్ నందు మీ హాజరు నిమిత్తం వాయిదా ది.16-04-2024, కావున మీరు పై కోర్ట్ వారి యెదుట వాయిదా తేది:16-04-2024 ఉదయం గం 10.30 ని.కు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున వ్యవహారము తీర్మానము చేయబడునని ఇందు మూలముగాతెలియ చేయుట మైనది.

వాయిదా తేదీ : 16-04-2024.
పర్చూరు
తేదీ : 01-04-2024

// కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు //
పోతిని సురేంద్ర
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి.
పిటిషనర్ తరుపు అడ్వొకెట్స్
పర్చూరు.

నోటీసు

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

I.A. 273/2021
in
I.A.142 /21
in
O.S.59 /21

Between
దగ్గుబాటి సుగుణ .... పిటిషనరు/ వాది
V/s
యార్లగడ్డ శ్రీదేవి వగైరాలు ..... రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

To,
దగ్గుబాటి @ యార్లగడ్డ శ్రీదేవి @
సీతమ్మ, W/o తిరుపతయ్య చౌదరి,
R/o 7th లైన్, యజ్ఞశాలపేట, కారంచేడు గ్రామం
కారంచేడుమండలం, పర్చూరు D.M.C,
బాపట్ల జిల్లా.

పై కోర్ట్ నందు పిటిషనరు పిటిషన్ పరిహారం నిమిత్తం, మీ పై పిటిషన్ దాఖలు చేయగా, సదరు పిటిషన్ నందు మీ హాజరు నిమిత్తం వాయిదా ది.16-04-2024.కావున మీరు పైకోర్ట్‌వారి యెదుట వాయిదా తేదీ :16-04-2024 న ఉదయం గం. 10.30 ని.కు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున వ్యవహారం తీర్మానం చేయబడునని ఇందుమూలముగా తెలియచేయుట మైనది.

వాయిదా తేదీ : 16-04-2024.
పర్చూరు
తేదీ : 01-04-2024

// కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు //
పోతిని సురేంద్ర
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి.
పిటిషనర్ తరపు అడ్వొకెట్స్
పర్చూరు.

పచ్చని చెట్లు నరికివేత

- అడ్డుకున్న స్థానికులు
- వెనుతిరిగిన సచివాలయ సిబ్బంది



చెట్లను నరికి వేస్తున్న దృశ్యం



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న స్థానికులు

ప్రజాశక్తి-కనిగిరి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఆదివారం కనిగిరిలో నిర్వహించారు. బస్సు యాత్ర సందర్భంగా సచివాలయ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను తొలగించారు. కనిగిరిలోని శంకవరం, ఆర్‌టిసి డిపో, జీపుస్టాంట్ సెంటర్‌లో ఏళ్ల తరబడి నీడనిచ్చే చెట్లను తొలగించేందుకు ప్రయత్నించారు. దీంతో స్థానికులు అధికారులతో వాగ్వాదం చేశారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు చెట్లు ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా రోడ్లకు ఇరువైపులా నీడని పచ్చని వేప, చింత చెట్లను తొలగించడం ఏంటని వారు నిలదీశారు. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బందిని స్థానికులు అడ్డుకున్నారు ముఖ్యమంత్రి జగన్ వస్తే ఏంటి గొప్ప అని.. పచ్చని చెట్లను ఎందుకు నరికేస్తున్నారని ప్రశ్నించారు. అప్పటికే ఐదు పెద్ద చెట్లను నరికి వేశారు మరో 20 చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ విషయం గురించి ప్రజలు నిలదీయడంతో సచివాలయ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నేపథ్యంలో కనిగిరిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రజలకు పూర్తిస్థాయిలో సమాచారం తెలియచేయకుండా రోడ్లకు ఇరువైపులా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి కాలం కావడంతో విద్యుత్ సరఫరా లేని కారణంగా ఉక్కపోతకు గురయ్యారు. వ్యాపారులు అవస్థలు పడ్డారు.



అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ప్రసన్న

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి

ప్రజాశక్తి-కొమరోలు

అనుమానాస్పద స్థితిలో ఓ గర్భిణి మృతిచెందిన ఘటన కొమరోలు పట్టణంలోని చర్చి వీధిలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... చర్చివీధికి చెందిన లంకోజి ప్రసన్న(30) ఇంటిలోని బాత్రూంలో అనుమానాస్పద స్థితిలో తీవ్ర గాయాలతో మృతి చెందింది. ఈ ఘటన రెండు రోజుల క్రితం జరిగి ఉంటుందని భావిస్తుండగా ఆదివారం వెలుగులోకి వచ్చింది.. మృతురాలి సోదరుడు ఆమె భర్త నారాయణపై అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని కె.ఉప్పలపాడు గ్రామంలో స్వచ్ఛంద సేవా సంస్థ హెల్పింగ్ హాండ్స్ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు రాఘవేంద్రశర్మ, ప్రెసిడెంట్ డి.సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, సభ్యులు నరేంద్ర, మధు, విష్ణువర్ధన్‌రెడ్డి, రవికుమార్, వంశీ, దాసు, దయనందం, వెంకారెడ్డి, వాకా శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండపిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలో ఆదివారం 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటల నుంచి వడగాల్పుల వీయడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. ఎండ తీవ్రతకు వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బందులకు గురయ్యారు.



జాళ్లపాలెంలోని వీరబ్రహ్మేంద ఆలయం

9న జాళ్లపాలెం తిరునాళ్ల


కొండపి : ఈనెల 9న ఉగాది పండుగ నేపథ్యంలో జాళ్లపాలెంలో వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాళ్లపాలెంకు చెందిన కొత్తపల్లి చంద్రయ్య, బురెమ్మ దంపతులకు 1848లో బ్రహ్మయ్య జన్మించాడు. ఆయన చిన్న తనం నుంచి బ్రహ్మం గారి భక్తుడు. 1915లో ఉగాది పర్వదినాన సజీవ సమాధి అయ్యారు. అప్పటి నుంచి బ్రహ్మయ్య వంశీకులు గ్రామపెద్దల సహకారంతో తిరునాళ్ల జరుపుతున్నారు. కందుకూరు, ఒంగోలు, పొదిలి ఆర్‌టిసి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపుతున్నారు. దాతల సహకారంతో అన్నదానం నిర్వహించనున్నారు. తిరునాళ్ల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కనిగిరి ప్రాంతాన్ని

పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ సమావేశం పి.నరేంద్ర అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎఫ్.బాబు మాట్లాడుతూ భగత్ సింగ్, చేగువేరా లాంటి దేశభక్తులను ఆదర్శంగా తీసుకొని డివైఎఫ్ఐని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివైఎఫ్ఐ ఆవిర్భావం నుంచి నేటి వరకూ యువతీ, యువకులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకుల వర్ధంతి, జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ పేరుతో వందలాది ఎకరాల భూమని సేకరించినట్లు తెలిపారు. ఇప్పడు దాన్ని గాలికి వదిలేశారన్నారు. నిమ్జ్‌ను పూర్తి చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కనిగిరి ప్రాంతంలో తాగునీటి సమస్య ఉందన్నారు. అధికారులు దృష్టి సారించి తాగునీటి సమస్యను పరిష్కరించాలనఆనరు. అనంతరం డివైఎఫ్ఐ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా అనిల్ ,కార్యదర్శిగా నరేంద్ర ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో నారాయణ, శివ, శ్రీను, కుమార్, రవి, కిరణ్, చెన్నకేశవులు, కష్ణార్జున, ధర్మయ్య, ఆమోస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎఫ్.బాబు

ముగిసిన రెండో రౌండ్ పొగాకు కొనుగోళ్లు

- నేటి నుంచి మూడో రౌండ్ కొనుగోళ్లు
- రెండో రౌండ్‌లో కిలో పొగాకు సరాసరి ధరరూ.228 ,87 పైసలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో రెండో రౌండ్ కొనుగోళ్లు శనివారంతో ముగిశాయని, సోమవారం నుంచి మూడో రౌండ్ పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. రెండో రౌండ్ పూర్తి అయ్యేనాటికి కిలో పొగాకు అత్యధిక ధర రూ.235, అత్యల్ప ధర రూ.220 , సరాసరి ధర రూ.228.87 పైసలు పలికినట్లు తెలిపారు. మూడో రౌండ్‌లో ఫుల్ బ్యారన్‌కు 4 బేళ్లు వంతున అమ్మకానికి అనుమతి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

గిట్టుబాటు ధర రూ.280 కల్పించాలి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో మొదటి రౌండ్, రెండవ రౌండ్‌లో ధరలు నిరాశ పరిచాయి. బ్రైడ్ రకం బేళ్లకు ఆశించినంత స్థాయిలో గిట్టుబాటు ధర లబించలేదని రైతులు తెలిపారు. లోగ్రేడు పొగాకు ఒక రకమైన గిట్టుబాటు ధర లభిస్తున్నట్లు తెలిపారు. లోగ్రేడు పొగాకు అమ్మకాల వల్ల ఎలాంటి ఎటువంటి ఇబ్బందులు లేవని రైతులు తెలిపారు.బ్రైట్ రకం పొగాకుకు గిట్టుబాటు ధర రూ.280 గిట్టుబాటు అయితే అప్పుల ఊబిలో పడకుండా ఉంటామని తెలిపారు. రెండవ రౌండ్ ముగిసే సరికి బ్రైడ్ రకం పొగాకు కిలో సరాసరి ధర రూ.235 ఉందని తెలిపారు. మూడవ రౌండ్‌లోనైనా గిట్టుబాటు ధర లభిస్తుంది రైతులు ఆశాజనం వ్యక్తం చేస్తున్నారు.

కిలో పొగాకు అత్యధిక ధర రూ. రూ.235

కొండపి వేలం కేంద్రానికి చినవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 805 బేళ్లను శనివారం అమ్మకానికి తెచ్చారు. అందులో 629 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 76 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.235, అత్యల్ప కిలో రూ.220 సరాసరి ధర రూ. 228.92పైసలు పలికినట్లు వేలం నిర్వాహణాధికారి తెలిపారు.



పొగాకు వేలంలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు



చిన్నారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

లారీని ఢీకొన్న కారు చిన్నారి మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పి లారీని ఢీకొన్న ఘటనలో ఓ చిన్నారి మృతి చెందింది.మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన కొరిశపాడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం నుంచి కడప జిల్లా రైల్వే కోడూరు వెళుతున్న కారు ఘటనా స్థలం వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. అనంతరం అదుపు తప్పి లారీ ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ద్వారక(6)అనే చిన్నారి అక్కడిక్కడే మృతి చెందింది. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలులోని సంఘమిత్ర హాస్పిటల్‌కు తరలించారు. శ్రీకాకుళంలో డాక్టర్‌గా పనిచేస్తున్న జి.శివసుందర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పండుగ సందర్భంగా తమ స్వగ్రామమైన రైల్వేకోడూరుకు కారులో బయలు దేరారు. ఘటన స్థలం వద్దకు వచ్చేసరికి ప్రమాదం చోటు చేసుకుంది. మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ

ప్రజాశక్తి-కొండపి

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఎఒలు, ఎపిఒలకు ఎన్నికల నిర్వహణపై ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్ కె.ఝాన్సీరాణి పర్యవేక్షణలో ఆర్ఒ కుమార్ అధ్యక్షతన శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్ పోలింగ్, ఓటింగ్ విధానం, వివి పాడ్‌ల పనితీరుపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ పై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తహశీల్దార్లు, నోడల్ అధికారులు, సెక్టార్ అదికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపికి సహకరించే పార్టీలను ఓడించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి మద్దతు పలుకుతున్న టిడిపి, వైసిపిలను ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి రమాదేవిగారు కోరారు. స్థానిక పుచ్చల పల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సిపిఎం సభ్యులు, సానుభూతి పరులు సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి సీపీఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. నిరంతరం ప్రజలతో ఉంటున్న సీపీఎంకు అండగా నిలవాలన్నారు. దేశంలో రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తూ రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ఓడించాల న్నారు. దేశంలో మతం పేరుతో ప్రజలను విడగొడుతుందని అన్నారు. రైతులకు మద్దతుధర అమలు చేయాలని పోరాటం చేస్తుంటే పోలీసులుతో కాల్పులు చేశారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలుని ప్రైవేటీకరణ చేస్తున్నారని అన్నారు. కార్మికుల చట్టాలు, హక్కులను బిజెపి హరిస్తోందని అన్నారు. వంట గ్యాస్, విద్యుత్, చెత్త పన్ను, ఇంటిపన్నుల పెంపు బిజెపి, వైసిపి పాపమేనని అన్నారు. బిజెపితో జతకట్టి టిడిపి, జనసేనలు ఈ



సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి

పాపంలో వాటాదారులు అయ్యాయన్నారు. బిజెపి నమ్మక ద్రోహాన్ని ఎదుర్కోవడానికి కమ్యూనిస్టులు అసెంబ్లీలో, పార్లమెంట్లో ఉండాలని అన్నారు. సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ అమరావతి ప్రాంతానికి మోడీ సర్కార్ తీరని ద్రోహం చేసిందని అన్నారు. రాజధాని అమరావతిని ధ్వంసం చేశారని అన్నారు. సమావేశంలో సీపియం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, నాయకులు కె శరత్, వై భాస్కరరావు, కె నాగేశ్వరావు, శామ్యూల్, కుమార్, సుభాషిణి పాల్గొన్నారు.

పర్చూరు : దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించటమే కాక ఆంధ్ర రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి బిజెపి, ఎన్డీఏ కూటమిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి రమాదేవి కోరారు. సిపిఎం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి సిపిఎం నాయకులు కందిమల్ల రామకోటేశ్వరావు అధ్యక్షత వహించారు. స్థానిక శాతవాహన స్కూల్లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిజెపికి మద్దతు పలుకుతున్న టిడిపి, జనసేన, వైసీపీలను ఓడించాలని కోరారు. ఎన్నికల్లో ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. విభజన చట్టం ప్రకారం అమలు చేయాల్సిన అంశాలను పూర్తి చేయకుండా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేశారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై సిపిఎం మాత్రమే పోరాటం చేస్తుందని అన్నారు. ప్రజా ఉద్యమాన్ని బలపరిచి సిపిఎంకు మద్దతుగా నిలవాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజావాణిని అసెంబ్లీలో వినిపించడానికి సిపిఎంను, ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, బత్తుల హనుమంతరావు, బండి శంకరయ్య, కె శ్రీనివాసరావు, జి ప్రతాప్, నాగన్న, వెంకటరావు, ఆరు మండలాల్లోని సిపిఎం సభ్యులు, అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రావెల్ లారీని అడ్డుకున్న గ్రామస్తులు

మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రభుత్వం నుండి అనుమతులు లేకుండా ప్రమాదకరంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలను గ్రామస్తులు అడ్డుకొని పోలీస్ స్టేషన్ లో అప్పగించిన ఘటన మండలపరిధిలోని కోలలపూడి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది.అందిన వివరాల ప్రకారం కోలలపూడి గ్రామంలో గత కొంతకాలంగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టర్బో లారీ ల వల్ల గ్రామంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు మైనింగ్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడంతో గ్రామస్తు లు పలు మార్లు లారీలను అడ్డుకోవడం వెనువెంటనే రాజకీయ నాయకుల జోక్యంతో వాటిని వదిలిపెట్టడం జరుగుతుందని కోలలపూడి గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. 360 సర్వే నంబర్ లో 277 ఎకరా భూమిలో ఉన్న కొండ భూమి నుండి అక్రమంగా గ్రావెల్ తరలించడాన్ని అరికట్టాలని బాపట్ల జిల్లా కలెక్టర్‌కి స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ మైనింగ్ అధికారులు తూతుమంత్రంగా విచారణ జరిపి వెళ్లారు కానీ లారీలు మాత్రం యథేచ్ఛగా తిరుగుతున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీ ని గ్రామస్తులు అడ్డుకోని మార్టూరు సీఐ రాజశేఖరరెడ్డి కి ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు లారీని డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని మార్టూరు పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మైనింగ్ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీల యజమానులు, డ్రైవర్లు, వారికి సహకరిస్తున్న అధికారపార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



అన్నా క్యాంటిన్‌లో భోజనం వడ్డిస్తున్న టిడిపి కార్యకర్తలు

516 రోజులుగా అన్నా క్యాంటీన్

ప్రజాశక్తి - బాపట్ల

పేద ప్రజల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ 516వ రోజుకు చేరింది. సిరిగిరి వెంకటప్పయ్య, పుణ్యవతి ప్రమీల స్మారకార్థం వారి కుమారుడు గుంటూరుకు చెందిన రామకృష్ణ సహకారంతో ఆదివారం 400 మంది పేదలకు అన్న అన్నదానం చేశారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు సహకరిస్తున్న దాతలకు నరేంద్ర వర్మ కృతజ్ఞతలు తెలిపారు.



ఇంకొల్లులో రంజాన్ తోఫా అందిస్తున్న దృశ్యం

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక ముస్లిం కాలనీలో నిరుపేద కుటుంబాలకు షేక్ బాబర్ భాష దంపతులు, కుమార్తె కరిష్మా 300మందికి రంజాన్ తోఫా ఆదివారం అందజేశారు. ప్రతి ఏటా బాబర్ బాషా దంపతులు రంజాన్ పండుగను పురస్కరించుకొని 15రకాల సరుకులు పండుగకు పస్తు ఉండకూడదనే ఉద్దేశంతో అందజేశామని తెలిపారు. గత మూడేళ్లుగా 300మందికి రంజాన్ తోఫాను అందజేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ తోఫా అందజేయడం పట్ల ముస్లిం కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు. తోఫాలో చీర, బాస్మతి బియ్యం, రైస్, నూనె, సేమియా, ఆట, చింతపండు, కొబ్బరి, కారం, ఉల్లి, వెల్లుల్లి, పంచదార, కందిపప్పు, అల్లం సామాగ్రిని తోపాలు అందరికీ అందజేశారు. తోఫాను అందజేయడం పట్ల ముస్లిం కుటుంబీకులు బాబర్‌బాషా కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపిలోకి షాలెంరాజ్..

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లికోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెంరాజ్ టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో టిడిపిలో ఆదివారం చేరారు. వేమూరు టిడిపి అభ్యర్థి, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు ఆధ్వర్యంలో ఆయన టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన ప్రజాగళం సందర్భంగా చంద్రబాబు ఆయనకు టిడిపి కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ టిక్కెట్ కూడా బూరక సుబ్బారావుకు కేటాయించడంతో మనస్థాపానికి గురై రానున్న ఎన్నికల్లో టిడిపిలో పనిచేయాలని నిశ్చయించుకుని ఆనందబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరినట్లు అతని సన్నిహితులు పేర్కొన్నారు.



శాలెంరాజును టిడిపిలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

భానుడి భగ భగ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎండ వేడిమితో జనం అల్లాడిపోతున్నారు. వేసవి ప్రారంభంలోనే మండలంలో ఎండలు మండిస్తున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనానికి ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉంటోంది. పగటి పూట 40 నుంచి 43 డిగ్రీలు నమోదవుతుంది.

జాగ్రత్తలు తీసుకోండి

డాక్టర్ దియ్యన దివ్యలహరి, ద్రోణాదుల మెడికల్ ఆఫీసర్

రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుతున్నాయి. వడ దెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏవైనా ముఖ్యమైన పనులు ఉంటె తప్ప ఎండలో తిరగకూడదు. అత్యవసరమైన పనులు ఉదయం పూటనే చేసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే కచ్చితంగా గొడుగు, టోపీ ధరించాలి. రోజుకు కనీసం 15గ్లాసుల నీళ్ల తాగాలి. నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ళ, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

కార్యకర్తలతో గొట్టిపాటి హర్షవర్ధన్

ప్రజాశక్తి- సంతమాగులూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమిష్టిగా కృషి చేసి విజయం సాధించాలని ఎంఎల్ఎ గొట్టిపాటి రవి కుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ కోరారు. పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు జంక్షన్ కూడలిలో హెూటల్లో గ్రామ సర్పంచి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురు యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాయ్ విత్ హర్షవర్ధన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు టిడిపి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్, బాబు షత్యురిటి, భవిష్యత్ గ్యారెంటీ, మహాశక్తి పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, తేలప్రోలు రమేష్, ధూపాటి ఏసోబు, మురళి, మాదాల సుబ్బారావు, ఆవుల కోటేశ్వరరావు, నంబుల కొండలు, సింబోతుల వీరయ్య, మాబు సైదా, అనంతవరపు దేవా పాల్గొన్నారు.



అడ్డ రోడ్డు టీ స్టాల్ వద్ద హర్షవర్ధన్ ఎన్నికల ప్రచారం

పాత నేరస్తులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పాత నేరస్తులను గుర్తించి ఎస్ఐ శ్రీనివాసరావు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లుగా నమోదైన వారిని పోలీసులకు అందుబాటులో ఉండాలని సూచించారు. భట్టిప్రోలు, వెల్లటూరు, సూరేపల్లి, తాతవారిపాలెం, వేమవరం గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

రైతు వ్యతిరేక జగన్ బుద్దిచెప్పాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

ప్రజా, రైతు వ్యతిరేక విధానాలతో అరాచక పాలన చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ ఓటర్లను కోరారు. పట్టణంలో బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టి కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యను ఆయన దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. తాము అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రవికుమార్ తనయుడు హర్షవర్ధన్, మాజీ ఎంపీపీ అట్లా చిన్న వెంకటరెడ్డి, ఎంపీపీ వై ఎలమంద, అట్లా పెద్ద వెంకటరెడ్డి, చేవూరి వాసురెడ్డి, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురు యాదవ్, తేలప్రోలు రమేష్, ధూపాటి ఏసోబు, మాదాల సుబ్బారావు, బండారు పుల్లారావు, డి గాలెయ్య, కుంచాల వీరనారాయణ పాల్గొన్నారు.



ప్రచారంలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

ప్రజాసేవకు పదవులు అవసరం లేదు

ప్రజాశక్తి - అద్దంకి

పదవుల కోసం టిడిపిలోకి రాలేదని, దర్శి ప్రజలకు ప్రజాసేవ చేయటానికే ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలబడ్డానని గొట్టిపాటి లక్ష్మి కడియాల అన్నారు. మండలంలోని శంకరాపురంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఆమెకు మహిళలు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆమెను పూలమాలలు, సాలువాలతో సత్కరించారు. విధుల్లో ఓటర్లకు నమస్కరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శంకరా పురం గ్రామానికి సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి టిడిపి అధికారానికి వచ్చిన వెంటనే రూ.100కోట్లతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయించి శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వట్టిపాడు లక్ష్మి మామయ్య కడియాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ అందాలకు వెంకట్రావు, టిడిపి మండల అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి, నారాయణస్వామి, మాజీ జడ్పిటిసి కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకట్రావు, టిడిపి నాయకులు ఎం కొండలరావు జి శేషగిరిరావు, మాజీ సర్పంచ్ బేతపూడి బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

వార్డుల్లో గొట్టిపాటి లక్ష్మి పర్యటన



వార్డులో పర్యటిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీ లోని 16, 12 వార్డుల్లో టిడిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలుత ఆంజనేయ స్వామిగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొట్టిశ్రీరాములు వీధి, గొర్లగడ్డ, పుట్ట బజారు, కోత మిషన్ బజార్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అన్ని విధాల అభివద్ధి చెందుతుందన్నారు. పేదలు, మహిళల అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను తెచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దొనకొండ మండలం మంగినపూడికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నాయకులు నారపుశెట్టి మధు, జూపల్లి కోటేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, ఐటిడిపి ఉపాధ్యక్షుడు రామయ్య, బిజెపి నాయకులు తిండి నారాయణరెడ్డి, మండపాకల శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాపారావు, కొండయ్య, చిరంజీవి, టిడిపి నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణకు కృషి

టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర



సమావేశంలో పాల్గొన్న మాగుంట రాఘవరెడ్డి, డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-సిఎస్.పురం

కనిగిరి నియోజకవర్గ ప్రజలు ఉపాధి కోసం వలసలు వెళుతున్నారని, ఆ వలసల నివారణకు ప్రత్యేక కషి చేస్తానని టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. చెన్నైలో నివాసముంటున్న కనిగిరి నియోజకవర్గ ప్రజలతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో అందరికీ ఉపాధి లభించాలంటే పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు కావాలంటే టిడిపి అధికారం లోకి రావాలన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ట్రిపుల్ ఐటి, నిమ్జ్, రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేసి వలసల నివారణకు పాటుపడతానని తెలిపారు. రాష్ట్రంలో రాక్షసు పాలన సాగుతుందని ఆ పాలనకు అంతం పలకాలని పిలుపునిచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాల ద్వారా పేదల అభివద్ధికి బాటలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగుంట రాఘవరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వరరావు, ఆరు మండలాల టిడిపి అధ్యక్షులు, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో గొట్టిపాటి లక్ష్మి

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు మండలం, ఆవులమంద గ్రామ పరిధిలోని ముష్ణ గంగవరం గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు ఆదివారం టిడిపిలో చేరారు. ఆవులమంద గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు గొట్టిపాటి వెంకటేశ్వర్లు, గొట్టిపాటి రామయ్య ఆధ్వర్యంలో ముష్ణ గంగవరం గ్రామానికి చెందిన వెంకట లింగయ్య, కోటేశ్వరరావు, పెద్ద నాగ శేషయ్య, మరో 17 కుటుంబాల వారు టిడిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో టిడిపిలో చేరారు. గొట్టిపాటి లక్ష్మి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి

టిడిపి చీరాల నియోజక వర్గ అభ్యర్థి ఎంఎం. కొండయ్య



మాట్లాడుతున్న ఎంఎం. కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి చీరాల నియోజక వర్గ అభ్యర్థి ఎంఎం. కొండయ్య తెలిపారు. మండల పరిధిలోని దేవాంగపురిలో టిడిపి గ్రామ అధ్యక్షులు పృథ్వీ లలిత మోహన్, వస్త్ర వ్యాపారవేత్త సిద్ధి బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో చేనేతల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో చేనేతలు అధికంగా ఉన్నారని తెలిపారు. వారి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. తనకు ఒక్క అవకాశమిస్తే టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల కొనుగోలు, ప్రభుత్వ సంస్థల్లో చేనేత వస్త్రాల వినియోగం, నూలు, పట్టు,సబ్సిడీపై జరీ రంగులు రసాయనాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు మహేంద్రనాథ్, సబ్జా రేణుక, పృథ్వీ వెంకటేశ్వర్లు, జొన్న చిన్న రాజు, రాజా, జొన్న శేషలక్ష్మి, కర్ణ, గిరీష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక..

వేటపాలెం గ్రామానికి పొగడదండ వెంకటేశ్వర్లు, ఆయన కుమారులు సుబ్బారావు, నరసింహ ఆధ్వర్యంలో 80 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. అదేవిధంగా బోయినవారిపాలెం చెందిన పలువురు యువకులు ఎంఎం. కొండయ్య సమక్షంలో టిడిపిలో చేరారు.



ప్రచారం నిర్వహిస్తున్న కరణం వెంకటేష్

పేదల సంక్షేమానికి కృషి : కరణం

ప్రజాశక్తి-చీరాల

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక ఎంజిహెచ్ కాలనీలోని కళ్యాణ మండపంలో కాలనీవాసులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ చీరాల పట్టణ ప్రజలు, వ్యాపారులు గత ఐదేళ్లుగా స్వేచ్ఛా, ప్రశాంత వాతావరణంలో జీవించినట్లు తెలిపారు. అనంతరం మండల పరిధిలోని గాంధీనగర్‌లో వైసిపి చీరాల నియోజక వర్గ అభ్యర్థి కరణం వెంకటేష్ కలిసి బలరాం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసోది అద్దంకిరెడ్డి, చిన్ని లీలధర్, గునిమి చెంచురెడ్డి, ఆసోది రాజారెడ్డి, మంచాల నాగరాజు, మాకాని శ్రీనివాసరావు, పల్లప్రోలు సాయి, దిండు కోటిరెడ్డి, కోకి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మాగుంట, ఎమ్మెల్యే స్వామి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : స్వామి

ప్రజాశక్తి-కొండపి, శింగరాయకొండ

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. వృత్తి రీత్యా హైదరాబాదులో ఉంటున్న కొండపి నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగులు, టిడిపి నాయకులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే స్వామి, మాగుంట రాఘవరెడ్డి, ఐటి ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని,దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సిఎం పదవి చేపట్టాక ఉపాధి అవకాశాలు లేక వలసలు పెరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదు పరిసర ప్రాంతాల్లో ఉంటున్న కొండపి నియోజకవర్గానికి చెందిన వివిధ రంగాల ఉద్యోగులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఇఒ కాకర్ల రఘురామయ్య తెలిపారు. మండల పరిధిలోని కట్టసింగన్నపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు పాఠశాల ఉపాధ్యాయుడు గొర్రెపాటి వేణు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ నేటీ పోటీ రంగంలో విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 బి.రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు సుభాని, హైమావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్

టిడిపి మేనిఫెస్టోను వివరించాలి

ప్రజాశక్తి-మద్దిపాడు

టిడిపి మేనిఫశ్రీస్టో గురించి ప్రజలకు వివరించాలని నియోజక వర్గ కోఆర్డినేటర్ బిఎన్. అనిల్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బీసీ సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బీసీలు ఎదుర్కొన్న సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, గ్రామ అధ్యక్షుడు కడియాల రఘు బాబు, నాయకులు ఆడాక స్వాములు, మందపల్లి శ్రీనివాసరావు, దొప్పా శేషయ్య, సుద్దపల్లి అనిల్, భానుచందర్, వేంకటేశ్వర్లు, యరగర్ల చైతన్య, భావన్నారాయణ, నరసింహా, సుబ్బారావు, సుబ్బారావు, రవి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదరిస్తే అభివృద్ధి చేస్తా : బిఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

తనను ఆదరిస్తే పేర్నమిట్ట గ్రామాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని టిడిపి కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బిఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని పేర్నమిట్ట వడ్డెరపాలెంలో టిడిపి నాయకులు తన్నీరు రామారావు, గుంజి రాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు జనసేన ఎస్ఎన్ పాడు నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ టిడిపి హయాంలోనే బీసీలకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసి పేదలకు అందించిన ఘనత టిడిపిదేనని గుర్తు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, టిడిపి అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని తెలిపారు. నిలిచిపోయిన రహదారుల పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు టిడిపి మండల మాజీ అధ్యక్షుడు శిరిపురపు రుద్రయ్య, టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు వివరం గోవిందయ్య, కొట్టే వెంకటేశ్వర్లు, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, కరిచేటి శ్రీనివాసరావు, పేర్నమిట్ట శ్రీనివాస్, పవన్ యువసేన నగర ప్రధాన కార్యదర్శి కందుకూరి వాసు, సంయుక్త కార్యదర్శి ఇంకొల్లు శ్రీమన్నారాయణ, గంగిశెట్టి రాముడు, మేకల పూర్ణచంద్రరావు, డివిజన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి రాము, చల్లా కృష్ణ, ఇదింపల్లి మధు, కోఆర్డినేటర్ కృష్ణమోహన్, బిజెపి నాయకుడు దేసు రాంబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఎన్.విజయ్‌కుమార్



టీడీపీలో చేరిన వారితో అశోక్‌రెడ్డి

టీడీపీలో చేరిన నారాయణరెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో మండలంలోని అంబవరం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు సిరిపిరెడ్డి నారాయణరెడ్డి తనతో పాటు ఒక మాజీ సర్పంచ్, విద్యా కమిటీ చైర్మన్, గ్రామంలోని 100 కుటుంబాలతో సహా వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపిని వీడి టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్ ఎండూరి ఏసురత్నం, విద్యా కమిటీ చైర్మన్ షరీఫ్ బాషా, సిరిపిరెడ్డి నరసింహారెడ్డి, కంచర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైపాలెం వైద్యశాలలో నీటి కరువు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



నిరుయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల వైద్యశాలలో రక్షిత నీటి సదుపాయం లేక రోగులు అల్లాడుతున్నారు. గొంతు తడుపుకునేందుకు బయట లీటరు రూ.5 చొప్పున వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో గత రెండేళ్ల కిందట రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అది ఆరు నెలలు మాత్రమే పని చేసింది. అప్పట్లో ఆ ప్లాంట్ రోగులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. కాగా మరమ్మతులకు గురై ఏడాదిన్నర దాటింది. ఇప్పటి వరకు దానిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దీంతో రోగులు, రోగుల వెంట వచ్చే ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగుల ఇబ్బందులను గుర్తించి ఆసుపత్రి అభివృద్ధి నిధులతోనైనా మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి సురక్షిత నీటి సదుపాయం రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



సమావేశమైన ఆలయ నూతన కమిటీ

దేవస్థాన అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి

ప్రజాశక్తి-గిద్దలూరు

అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పట్టణంలోని జయరాం లాడ్జి సమీపంలోని అయ్యప్పస్వామి దేవస్థాన నూతన అధ్యక్షుడు కటకం మధుసూదన్ వినయ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం జరిగింది. అధ్యక్షులుగా కటకం మధుసూదన్ వినయ్, ఉపాధ్యక్షులుగా కమతం శ్రీనివాసులు, కటారు అరుణ్ కుమార్ యాదవ్, కోశాధికారిగా బాదం రమేష్, కార్యదర్శిగా పోలెబోయిన పాండు, గౌరవ అధ్యక్షులుగా ఆర్డి ఉమామహేశ్వరరావు, ఆర్డి రామకృష్ణ, లీగల్ అడ్వైజర్‌గా న్యాయవాది తిరుమల ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్పస్వామి దేవస్థాన అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని వారు తెలిపారు.

అధికారంలోకి రాగానే..

బీసీలకు 50 ఏళ్లకే పింఛన్

టీడీపీ నాయకులు బొమ్మాజి అనిల్ కుమార్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు 50 ఏళ్లకే 4 వేల రూపాయల పెన్షన్ అందిస్తామని టిడిపి నాయకులు బొమ్మాజి అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని గంగవరం టిడిపి కార్యాలయంలో 'జయహో బీసీ' సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్‌కుమార్ మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి ఆర్థిక అభివృద్ధి, ఉపాధి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పరిపాలన కొనసాగుతుందని, పేద ప్రజలు మహిళలపై దాడులు, దోపిడీలు పెరిగిపోయి రౌడీరాజ్యంగా మారిందన్నారు. వైసిపి సైకో పాలనను అంతం చేద్దామని, రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుని, ఎమ్మెల్యేగా బిఎన్ విజయ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, కోఆర్డినేటర్ రావులపల్లి సురేష్‌బాబు, నాయకులు కుంచాల రాజు, బాశం శ్రీను, కుంచాల ఆంజనేయులు, బొడ్డపాటి శ్రీనివాసరావు, రాయళ్ల సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బొమ్మాజి అనిల్ కుమార్

'అనగాని' సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె మండలం పెనుముడి, పేటేరు గ్రామాల నుంచి 40 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో పంచాయతీల్లో అభివృద్ధి నిలిచిపోయినట్లు తెలిపారు. టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. తెలుగుదేశం పార్టీ సంక్షేమ పథకాల మ్యానిఫెస్టోకు ప్రజలు ఆకర్షితులు కావడంతో రాష్ట్ర అభివృద్ధి కోసం టిడిపిలోకి చేరికలు భారీగా పెరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న న్యామతుల్లా బాషా

ఘనంగా బ్రిలియంట్ కంప్యూటర్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బ్రిలియంట్ కంప్యూటర్స్ 29వ వార్షికోత్సవం స్థానిక అంజయ్య రోడ్డులోని ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ న్యామతుల్లా బాషా, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహురలు కేక్ కట్ చేసి సిబ్బంది, విద్యార్థులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకలో డాక్టర్ న్యాయతుల్లా బాషా మాట్లాడుతూ సాంకేతిక విద్యతో అత్యంత ఉపయోగకరమైన కోర్సులను ప్రకాశం జిల్లాకు అందించడంలో సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా వందమంది పేద విద్యార్థులకు జాబ్ ఓరియంటెడ్ కోర్సులు పూర్తిగా ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 10వ తేదీలోపు సంస్థ ప్రధాన కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అఖిల్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణారావు

టిడిపివి ధన రాజకీయాలు: ఎంపీ మోపిదేవి

ప్రజాశక్తి-రేపల్లె

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ధన రాజకీయాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతోందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణం లోని 23వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఎంపీ మోపిదేవి మట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతిపక్ష టీడీపీ ఇతర పార్టీ నాయ కులకు, కార్యకర్తలకు, ప్రజలకు ప్యాకేజీలు ఇచ్చి, ప్రలోభాలకు గురిచేయటం పరిపాటిగా మారిం దని ధ్వజ మెత్తారు. కమిట్మెంట్‌తో, విలువలతో కూడిన రాజకీయాలు చేస్తేనే ప్రజలు స్వాగతి స్తారని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండో పర్యాయం ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారనటంలో ఎటువంటి సందేహమూ లేదన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ గణేష్‌ను, బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నందిగాం సురేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిమట బాలాజీ, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, మాజీ శాసనసభ్యులు దేవినేని మల్లికార్జునరావు, యువ నాయకులు మోపిదేవి రాజీవ్ పాల్గొన్నారు.

సంపద సృష్టి చంద్రబాబుతోనే సాధ్యం: మన్నె

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అప్పులతో కాకుండా సంపద సృష్టించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నది తెలుగుదేశం పార్టీ విధానమని, సంపద సృష్టి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నేత డాక్టర్ మన్నె రవీంద్ర అన్నారు. ఆదివారం ఆయన పెద్దదోర్నాల పట్టణంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు కుమారుడు గూడూరి అజిత్, కుమార్తె డాక్టర్ గూడూరి చెల్సియాతో పాటు స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నె రవీంద్ర మాట్లాడుతూ గత అయిదేళ్లలో జగన్ విధ్వంస పాలన కారణంగా 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. అయినప్పటికీ రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రణాళిక చంద్రబాబు వద్ద ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్‌బాబు, ఎంపి అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎరిక్షన్‌బాబు కుమారుడు అజిత్, కుమార్తె చెల్సియా కూడా ఇంటింటికీ ప్రజలతో మమేకమయ్యారు. మండుటెండలోనూ వారి ఎన్నికల ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జున రెడ్డి, టిడిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, సుబ్బరత్నం, షేక్ మాబు, నాగేంద్రబాబు, గోపాల్, శ్రీనివాస యాదవ్, బాషా పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు కుమారుడు అజిత్, కుమార్తె చెల్సియా, డాక్టర్ మన్నె రవీంద్ర

హాస్టల్ వార్డెన్ తొలగింపు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి కండువా కప్పుకున్న ఉద్యోగిని విధుల నుంచి తొలగించినట్లు యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ తెలిపారు. మార్కాపురం మండలం దరిమడుగులో ఉన్న 'యర్రగొండ పాలెం మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ హాస్టల్'లో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ముండ్లా నరసింహులు ఇటీవల టిడిపి కండువా కప్పుకున్నారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డితో కలిసి టిడిపి కండువా కప్పుకున్నట్లు పత్రికల్లో రావడంతో సర్వీసు నుంచి తొలగించారు.

వాలంటీర్ తొలగింపు

పెద్దదోర్నాల మండలంలోని చిన్న దోర్నాలలో వాలంటీర్‌గా పని చేస్తున్న ఎలకపాటి అల్లూరయ్య వైసీపీ ప్రచారంలో పాల్గొన్నట్లు తగిన ఆధారాలతో సి విజిల్ ద్వారా ఫిర్యాదులు వచ్చాయి. విచారించిన ఎంపిడివో నివేదిక అందజేశారు. దీని ఆధారంగా అల్లూరయ్యను విధుల నుంచి తొలగించినట్లు వైపాలెం ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ తెలిపారు.

తెలుగు పండుగ ఉగాది

ప్రజాశక్తి-చీరాల



సన్మానం పొందిన విశిష్ట వ్యక్తులు

తెలుగు పండగ ఉగాదిని ప్రజలందరూ ఎంతో సంతోషంగా నిర్వహించుకుంటారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు బత్తుల బ్రహ్మారెడ్డి అన్నారు. బత్తుల సర్వీస్ ట్రస్ట్, చీరాల వారి ఆధ్వర్యంలో ముందస్తు తెలుగు ఉగాది వేడుకలు రోటరీ క్లబ్ చీరాలలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముందుగా పలువురు విశిష్ట వ్యక్తులను సన్మానించారు. అనంతరం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. చీరాల ప్రాంత కవులు ఉగాది ప్రాశస్త్యం గురించి కవితాగానం ఆలపించారు. వర్తమాన రాజకీయ అంశాలు, వివిధ పండుగల నేపథ్యం, సామాజిక సమస్యల ఇతివృత్తాలతో కవులు తమ కవితలను వినిపించి ఆహూతులను అలరింపజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తిమ్మన శ్యామ సుందర్ హేమంత్ కుమార్, వైద్యులు గుంటుపల్లి సుబ్బారావు, వడలి రాధాకృష్ణ, యువజన పురస్కార గ్రహీత మంత్రి మాల్యాద్రి కృష్ణ మోహన్, ఏకాంబరేశ్వర బాబు, నాగ వీర భద్రాచారి, పవని భానుచంద్రమూర్తి, యలమందారెడ్డి, దయాకర రెడ్డి, పవని, సురేష్, చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

సోమవారం 8 ఏప్రిల్ 2024

అడుగంటిన తాగునీటి చెరువులు

- నీటి కోసం అల్లాడుతున్న ప్రజలు
- నేటి నుండి చెరువులకు చేరనున్న సాగరు నీరు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలో తాగునీటి చెరువులు పూర్తి స్థాయిలో అడుగంటాయి. దీంతో ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. ఉన్న కొద్ది నీరు కూడా పూర్తిగా పచ్చగా మారాయి. దుర్వాసన వస్తున్నాయి. ఆ నీటిని వాడుకునేందుకు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది కుళాయిలను నేరుగా కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఇంకొల్లులోని నాగులచెరువు, పెద్ద చెరువు పూర్తిగా అడుగింటాయి. రోజుకు 300క్యూసెక్కుల నీరు అవసరం ఉంది. రెండు రోజులకు ఒక సారి పంచాయతి నీటిని విడుదల చేస్తుంది. మండలంలో 17తాగు నీటి చెరువులు ఉన్నాయి. దాదాపు అన్ని చెరువులు పూర్తి స్ధాయిలో అడుగింటాయి. సాగర్ కాలువలకు నీరు విడుదల చేస్తుండడంతో తాగునీటిని పూర్తిగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఎన్ఎస్పి అధికారులు సమిష్టి కృషితో చెరువులు నింపాల్సిన అవసరం ఉందని ఎన్ఎస్పి ఎఈ బాలకృష్ణ నాయక్ తెలిపారు. మండలంలో తాగునీటి చెరువులను నింపాలంటే ఒక్కొక్క కాలువకు 300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే గాని తాగునీటి చెరువులు నిండవని అన్నారు. ప్రస్తుతం కోటపాడు, పావులూరు, నూతలపాడు, ద్రోణాదుల మేజర్ల నుండి ఆయా గ్రామాల తాగునీటి చెరువులను నింపవలసి ఉంది. కాలువకు రోజుకు 300క్యూసెక్కుల నీరు పూర్తిస్థాయిలో అందిస్తేనే నియోజకవర్గంలో పూర్తిగా చెరువులు నిండుతాయి. గ్రామీణ నీటి సరఫరా అధికారులు ఇచ్చిన ప్రాధాన్యత క్రమంలో వరుస క్రమంలో తాగునీటి చెరువులు నింపుతామని భరోసా ఇచ్చారు. అయినా ఏ మేరకు పూర్తి స్థాయిలో నింపుతారో వేచి చూడాల్సి ఉంది. కాలువకు నీళ్లు విడుదల చేసిన వెంటనే తాగునీటిని చెరువులకు మాత్రమే నింపుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారి జ్యోతి కోరారు. మండలంలో తాగునీటి చెరువులను నింపుకునేందుకుగాను ఆయా గ్రామాల సర్పంచులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.



అడుగింటిన ఇంకొల్లు చెరువు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పుట్టంరాజు ట్రస్ట్ ప్రతినిధులు

సాహితీ సభ కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీమిత్రమండలి సమావేశం చిన్ని మురళీకృష్ణ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం-2024కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రపంచ తెలుగు మహాసభల కార్యదర్శి డాక్టర్ జివి పూర్ణచందు పురష్కారం అందచేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. రూ.10వేల నగదు, పట్టు వస్త్రాలు అందచేసి ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. డివిఎం సత్యనారాయణ, లక్కరాజు శ్రీనివాసరావు, చిన్ని మురళీ కృష్ణ, సాహితీ మిత్రమండలి అధ్యక్షులు లక్కరాజు చంద్రశేఖర్, కార్యదర్శి కెవి పోలిరెడ్డి, కోశాధికారి చిన్ని మురళీకృష్ణ, లక్కరాజు శ్రీనివాసరావు, కొండకావూరి కుమార్, ఓరుగంటి శ్రీనివాసరావు, కుందా సుబ్బారావు, కూరపాటి రామకోటి, వామరాజు వెంకటేశ్వర్లు, కోలలపూడి శ్రీనివాసరావు, రమణారావు పాల్గొన్నారు.

బస్సులన్నీ సిఎం సభకు.. ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

సిఎం వైఎస్ జగన్ సభలకు ఆర్టీసి బస్సులను పంపించారు. దీంతో రోజువారీ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు సిఎం సభ అంటేనే బస్సులన్నీ పంపిస్తున్నారు. ఆర్టీసి అధికారులు మాత్రం బస్సుల్లో ఎవ్వరూ ఎక్కటం లేదని, సొంత వాహనాల్లో గమ్య స్ధానాలకు వెళుతున్నారని బుకాయిస్తున్నారు. సభలకు బస్సులు ఏర్పాటు చేస్తున్న అధికారులు ప్రయాణికులకు బస్సులు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని కోరుచున్నారు.

టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

టిడిపి అభ్యర్థి నక్కా ఆనందబాబు గెలుపును కోరుతూ భట్టిప్రోలులో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం ఆదివారం నిర్వహించారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి జరిగిన అన్యాయం, అభివృద్ధి నిరోధక చర్యలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వై కరుణ శ్రీనివాసరావు, ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్, ఆడిన బసవ పున్నయ్య, కనపర్తి సుందర్రావు, బట్టు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే : టిడిపి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని పోతురాజు గండిలోని టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు ఆదివారం సమావేశం అయ్యారు. రూ.2.70 లక్షల కోట్ల డీబీటీలో సగానికిపైగా కేంద్ర ప్రభుత్వ నిధులేనని అన్నారు. సంక్షేమ పథకాలకు జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో అధిక భాగం కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవేనని అన్నారు. సూపర్-6 అమలు చేస్తామ న్నారు. రూ.3వేలు నిరుద్యోగ భృతి, ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు ఉమ్మడి కూటమి నేతలు తెలిపారు. టిడిపి నేతలు నాగినేని రామకృష్ణ, చిన్ని.శ్రీనివాసరావు, జనసేన నేతలు చల్లా కృష్ణ, కాళీ చరణ్, గోరంట్ల సాయి, బీజేపీ నేతలు కొండ్రగుంట శ్రీనివాసరావు, షేక్ విరాట్ కాలేషా, మంగమూరి సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో టిడిపి నాయకులు నాగినేని రామకృష్ణ

వెంటాడుతున్న తాగునీటి సమస్య

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని చెంగల రాయుడు తోట ప్రాంతంలో గత వారం రోజులుగా మున్సిపల్ త్రాగు నీటి సరఫరా కావడం లేదు. త్రాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు పట్టించు కోవడం లేదని ఆ ప్రాంత ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు ఆ ప్రాంతంలో ఉన్నప్పటికీ త్రాగటానికి నీరు లేక ప్రజలు మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిఎం పల్లి, జిబిసి రోడ్డు, చీల్ రోడ్డు వరకు అంత గ్రతంగా నిర్మించిన త్రాగునీటి పైపులు లీకులు కావడంతో ఉదయం సమయాల్లో అనేక ప్రాంతాల్లో రోడ్లు జలమయంగా మారుతుంది. లీక్ అవుతున్న పైపులు తిరిగి పరమత్తు నిర్వహించి సక్రమంగా అమరిస్తేనే పట్టణంలో త్రాగు నీటి సమస్యకు పరిష్కార మార్గమని ప్రజలు గగ్గోలు పెడుతున్న అధికారుల్లో మాత్రం స్పందన కరువైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సరఫరా పైపులైన్లు మరమ్మత్తులు చేసి నీళ్లివ్వాలని కోరుతున్నారు.



చంగలరాయుడు తోటలో ఓవర్ హెడ్ ట్యాంక్



ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటికి మద్దతుగా కమలకిషోర్

కరోనా కంటే మద్యం మరణాలే అధికం

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మండలంలోని నక్కబొక్కలపాడులో ఆదివారం ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్(బుజ్జి)కు మద్దతుగా గొట్టిపాటి కమల కిషోర్ (బాబి) ఇంటింటికి వెళ్లి సూపర్ సెక్స్ పథకాలను వివరిస్తూ మే 13న జరుగు ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి కల్తీ మద్యం వల్ల అవయవాలు పూర్తిగా దెబ్బతిని ఎంతో మంది చనిపోతున్నారని, రాష్ట్రంలో కరోనా మరణాల కంటే జగన్ కల్తీ మద్యం మరణాలే అధికంగా ఉన్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.

మంచిని పంచేది ఇస్లాం మతం

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని దండుబాట రోడ్డులోని మసీద్ వద్ద నిర్వహించిన ఇఫ్తార్ విందుకు టీడీపీ కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ హాజరయ్యారు. ఉన్నదాంట్లో పదిమందికి పెట్టే గుణం, ఆకలి, దప్పికల విలువను తెలియజెప్పేది రంజాన్ మాసమని అన్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న నరేంధ్రవర్మ

ఇఫ్తార్ విందులో యడం బాలాజీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

జామియా మసీదు ఆవరణలో వైసిపి అభ్యర్థి యడం బాలాజి ప్రార్థనలు చేశారు. మత పెద్దలు శాలువా కప్పి ఆయనను మసీదులోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటి అధ్యక్షులు షేక్ ఉస్మాన్, కార్యదర్శి మస్తాన్‌వలి, మౌజన్ నజీర్, ముస్లీం మైనార్టీ కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, ఉప సర్పంచ్ సయ్యద్ లతీఫ్, కోఆప్షన్ సభ్యులు షేక్ సుబాని, బండారు ప్రభాకర్‌రావు, షేక్ షమీమ్, షేక్ మాలిక్, షేక్ బాబుల్లా పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న చందలూరి నారాయణరావు

చందలూరికి ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - అద్దంకి

గుంటూరులో అమరావతి సాహితి మిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో అద్దంకికి చెందిన చందలూరి నారాయణరావుకు ఉగాది పురస్కారం అందచేశారు. ఈ సందర్భంగా హాజరైన కవులు ఉగాది కవితలను చదివి వినిపించారు. ఆయన వ్రాసిన కవితల్లో కొన్నింటిని గురించి వివరిస్తూ నేడు రాష్ట్రంలో ఆధునిక కవిత్వంలో రాణిస్తున్న మంచి కవి నారాయణరావు అని పలువురు ప్రశంసించారు. కవిత్వం ఏ రూపంలో కన్ను తెరిస్తేనేమి అనే కవితని చదివి వినిపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు, గుమ్మా సాంబశివరావు, ఎం రాజా హుస్సేన్, హిందూ కాలేజ్ రిటైర్డ్ ప్రినిపాల్ డాక్టర్ దివి నరసింహ దీక్షితులు, భూసురపల్లి వెంకటేశ్వర్లు, పాణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



పీజీపాడులో అశోక్ బాబు ప్రచారం

అశోక్ బాబు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం పెనుగుదురుపాడు గ్రామంలో వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈపాటికే వివిధ గ్రామాల్లో వైసిపి నాయకులు ప్రచారం చేపట్టారు. అశోక్ బాబు ఒక మండలంలో ప్రచారం చేస్తుంటే ఆయన సతీమణి లక్ష్మి మరొక మండలంలోని ప్రజా ప్రతినిధులతో కలసి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఏడు రోజులుగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కావడానికి మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.



చేనేతలతో మాట్లాడుతున్న రావి రామనాంధంబాబు

వైసిపి పాలనలోనే సంక్షేమం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అందరి మంచి కోరే సీఎం జగన్ మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరో సారి ఆశీర్వదించి వైసిపి ప్రభుత్వానికి అండగా నిలవాలని డీసీఎంస్ మాజీ చైర్మన్ రావి రామనాథం బాబు కోరారు. వలపర్లలో ఆదివారం ఆయన పర్యటించారు. వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి యడం బాలాజీ, బాపట్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. స్థానిక చేనేత కాలనిలో ప్రగడ రామారావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వలపర్ల పిఏసిఎస్ చైర్మన్ పసుమర్తి లోకనాథం, వైసిపి నాయకులు కాళహస్తి కృష్ణమూర్తి, గోలి శ్రీను, బిట్ర కోటి, గోలి రాము, తవ్వ ఆదినారాయణ, పఠాన్ కాలేషా వలి, ముస్లీమ్ మైనారీటి రాష్ట్ర కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, కాకోలు రామారావు పాల్గొన్నారు.

టిడిపి గెలిస్తే 3 సిలిండర్లు ఉచితం

9వ రోజు ఇంటింటి ప్రచారంలో ముత్తుముల పుష్పలీల

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు నియోజక వర్గం అభివృద్ధి చెందాలంటే అశోక్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి ముత్తుముల పుష్పలీల కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా 9వ రోజు ఆదివారం గిద్దలూరు పట్టణంలోని 2వ వార్డులో ఇంటింటికీ తిరిగి టిడిపి, జనసేన, బిజేపి మేనిఫెస్టోలోని అంశాలను వివరిం చి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్డీయే అధికారంలోకి రాగానే మహిళలకు ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని అన్నారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, కలలకు రెక్కలు వంటి పథకాల ద్వారా మహిళాభ్యున్నతికి తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేయుచున్న ముత్తుముల అశోక్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న మాగుంట శ్రీనివాసులరెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ బూనేబోయిన చంద్రశేఖర్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఇంటిటి ప్రచారంలో ముత్తుముల పుష్పలీల

రూ.9 లక్షల సొత్తు స్వాధీనం

బంగారం, వెండిని పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ద్విచక్ర వాహనంలో తీసుకెళుతున్న రూ.9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను మార్టూరు పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రం వలపర్ల గ్రామానికి చెందిన కొల్లిపర నాగసుపేరావు బల్లికురవ మండల కేంద్రంలో బంగారం షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తన ద్విచక్ర వాహనంలో 96 గ్రాముల బంగారం, 4 కిలోల వెండి ఆభరణాలను తీసుకెళుతున్నారు. మార్టూరులో బిఎస్ఎఫ్ ఫోర్స్‌తో పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో వీటిని పట్టుకున్నారు. సరైన పత్రాలు లేని కారణంగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టిడిపి హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

- ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు
- 50 మంది గిరిజనులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి జరిగిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, బిజెపి-టిడిపి-జనసేన కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ఒంగోలు ఆస్టానా ఫంక్షన్ హాలులో ఒంగోలు నియోజకవర్గంలోని టిడిపి గిరిజనుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ గతంలో ఒంగోలు నగరంలో రూ.50 లక్షలతో గిరిజన భవనం నిర్మించామన్నారు. ఎన్ఎస్‌డిఎఫ్, ఎన్ఎస్‌కెఎఫ్ నుండి వందల మందికి సబ్సిడీ రుణాలు ఇచ్చామని, వైసిపి ప్రభుత్వంలో ఒక్క రుణం ఇవ్వలేదన్నారు. గిరిజనులకు నిబంధనలు లేకుండా రూ.50 వేలు పెళ్ళికానుక ద్వారా ఇచ్చామని, వైసిపి ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసిందన్నారు. భూమి కొనుగోలు పథకం ద్వారా గిరిజనులకు భూమి కొని ఇచ్చామని, ఆ పథకాన్ని కూడా రద్దు చేశారన్నారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా ఉచితంగా సివిల్స్, గ్రూప్-1 పరీక్షలకు శిక్షణ ఇచ్చామని, విదేశీ విద్య ద్వారా గిరిజనుల పిల్లలను ఉన్నత విద్యలు చదివించామన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని కూడా రద్దు చేసిందన్నారు. గిరిజనులకు 100 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చామని, ఈ పథకాన్ని వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని పునరుద్ధరించి వాటిని గిరిజనులకు అందిస్తామన్నారు. అనంతరం ఒంగోలు నగరం జయప్రకాశ్ కాలనీ నుండి సుమారు 50 మంది గిరిజనులు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి సెల్ అధ్యక్షులు దారు నాయక్, ఒంగోలు పరిశీలకులు వినకొండ సుబ్రహ్మణ్యం, రాపూరి శీను, కత్తి పద్మ, పార్లమెంట్ అధ్యక్షులు సేవ్య నాయక్, టిడిపి నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, రాచగర్ల వెంకట్రావు, లక్ష్మణ్ నాయక్, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండుటెండలో జగన్ బస్సుయాత్ర

- తల్లడిల్లిన కార్యకర్తలు, జనం - పొదిలిలో చీకట్లోనే..
- నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించిన జగన్
- కొనకనమిట్లలో బహిరంగసభ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మేమంతా సిద్ధం పేరుతో సిఎం జగన్ చేపట్టిన బస్సుయాత్ర జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సాగింది. శనివారం రాత్రికే జిల్లాలోకి వచ్చిన సిఎం జగన్ పొన్నలూరు మండలం, జువ్విగుంట వద్ద బస చేశారు. ఆదివారం 11 గంటలకు అక్కడ నుంచి ఆయన యాత్ర ప్రారంభించారు. కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో యాత్ర సాగింది. పశ్చిమప్రాంతంలో తిరిగి పట్టును నిలబెట్టుకునే వ్యూహంతోనే బస్సుయాత్ర ఈ నియోజకవర్గాల్లో చేపట్టారు. కదలిక తెచ్చే యత్నం చేశారు. ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేశారు. గతంలో పాదయాత్రతో జనంలో నడవగా.. ఇప్పుడు బస్సులోనే ఉండి ప్రచారం నిర్వహించారు. దొనకొండ అడ్డరోడ్డు వద్ద బహిరంగ సభ అనంతరం పొదిలి, దర్శి పట్టణాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తూ సాగిన ఆయన రాత్రికి దర్శి సమీపంలోని వెంకటాచలంపల్లి వద్దకు చేరుకుని బస చేశారు. మూడో రోజు సోమవారం నాడు దర్శి నియోజకవర్గంలో బస్సుయాత్ర కొనసాగనుంది. మండుటెండలో చేపట్టిన యాత్రకు జనం, పార్టీ కార్యకర్తలు తల్లడిల్లిపోయారు. పశ్చిమాన 43 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఎండలోనే సిఎం బస్సుయాత్రకు గ్రామాల నుంచి సమీకరణ చేశారు. రోడ్డు పొడవునా జనం ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఎండలో నిలుచోలేక అల్లాడిపోయారు. కనిగిరి వచ్చేసరికి మిట్టమధ్యాహ్నం కావడంతో జనం నిలబడలేకపోయారు. ఎండలకు జనం కూడా గతంతో పోలిస్తే కొంత తగ్గారని భావిస్తున్నారు. బస చేసిన ప్రాంతం నుంచి యాత్ర నిదానంగా సాగింది. గ్రామాల్లో అడుగడుగునా స్వాగతాలు ఏర్పాటు చేశారు. పలు చోట్ల క్రేన్‌లతో భారీ గజమాలలు ఏర్పాటు చేసి జగన్‌కు వేశారు. బస్సుపైకి వచ్చి అప్పుడప్పుడూ జనానికి అభివాదం చేశారు. కనిగిరిలో అభ్యర్థులందరితో బస్సు పైభాగానికి చేరుకున్నారు. కొంతసేపు పైనే నిలబడి ముందుకు సాగారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున కనిగిరి పట్టణంలో రెండు, మూడు నిమిషాలు కూడా ఆగలేకపోయారు. బస్సుయాత్ర సాగే మార్గమంతా వైసిపి కార్యకర్తల రాకపోకలతో సందడిగా మారింది. మధ్యాహ్నం చినారకట్ల సమీపంలో భోజన విరామానికి ఆగిన ఆయన అనంతరం యాత్ర కొనసాగించారు. చినారికట్ల జంక్షన్ మీదుగా దొనకొండ అడ్డరోడ్డుకు చేరుకున్నారు. అక్కడ బహిరంగ సభలో మాట్లాడారు. అనంతరం రాత్రికి పొదిలి, దర్శిలో రోడ్‌షోలు చేపట్టారు. మధ్యలోని గ్రామాల్లోనూ రహదారి వెంట ఉన్న కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బస్సుయాత్రలో సిఎం జగన్ వెంట మంత్రి సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కందుకూరు, కనిగిరి, మార్కాపురం, దర్శి అభ్యర్థులు బుర్రా మధుసూధన్‌యాదవ్, దద్దాల నారాయణయాదవ్, అన్నా రాంబాబు, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న సిఎం జగన్



బూచేపల్లిని పరిచయం చేస్తున్న సిఎం జగన్



సిఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు వేచి ఉన్న మహిళలు, వైసిపి నాయకులు

ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన అగ్రహారం

శింగరాయకొండ: సిఎం జగన్‌కు పొన్నలూరు మండలం, కె.అగ్రహారం ఆదివారం ఘనస్వాగతం పలికింది. ఆదివారం ఉదయం ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డితో సమావేశమయ్యారు. అక్కడ నుంచి మార్కాపురం వైపు వెళ్లారు. మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో పొన్నలూరు మండలం కే.అగ్రహారం వద్ద సిఎం జగన్‌కు భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ఆ గ్రామానికి చేరుకొని బస్సు మీదకి ఎక్కి ప్రజలతో మాట్లాడారు. అగ్రహారం వద్ద రోడ్డుకు ఇరువైపులా భారీగా జనం తరలిరావడంతో వారిని పలకరించారు. మరోసారి కొండపి నియోజకవర్గానికి వస్తానని అక్కడ ప్రజలతో చెప్పారు. పొన్నలూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు కొండేపి నియోజకవర్గంలోని ముఖ్య నేతలు అక్కడికి చేరుకొని ముఖ్యమంత్రికి భారీ క్రేన్లతో గజమాలలతో ఘనస్వాగతం పలికారు.

జగన్ చేతికి స్వల్పగాయం

పిసిపల్లి: సిఎం జగన్మోహన్‌రెడ్డికి వైసిపి నాయకులు స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం 11:30 గంటల సమయంలో మండలంలోని పాలేటిగంగమ్మ గుడి ప్రాంతంలోనికి బస్సు యాత్ర ప్రవేశించింది. గంగమ్మ గుడి సమీపంలో వైసిపి కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్, పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ వైఎం.ప్రసాద్‌రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పిసిపల్లి ఎంపిపి అత్యాల జఫన్య, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు పోలు జయరామిరెడ్డి, గృహ సారథుల కన్వీనర్ శీలం సుదర్శనం, ఓకేరెడ్డి, ఎంపిటిసిలు భూమిరెడ్డి కొండారెడ్డి, న్యాయవాది బలసాని మోహన్, మూలే రాజశేఖర్, వెంకటరావు పాల్గొన్నారు.

కనిగిరి: సిఎం జగన్ బస్సు యాత్ర ఆదివారం మధ్యాహ్నం పీసీపల్లి మండలం నుంచి అజీస్‌పురం వద్ద కనిగిరి మండలంలోని ప్రవేశించింది. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపాలెం వద్ద కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు జగన్‌కు ఘన స్వాగతం పలికారు. కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ సతీసతీమణి మంజు భార్గవి, వైసిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి తమ్మినేని సుజాతరెడ్డి గుమ్మడికాయలతో సీఎంకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందస్తుగా రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ సీఎం జగన్మోహన్‌రెడ్డికి టోపీ శాలువా కప్పి సత్కరించారు.

చీకట్లో జగన్ బస్సు యాత్ర

పొదిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పదవరోజు బస్సు యాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మార్కాపురం-దొనకొండ అడ్డరోడ్డు కూడలి జన సందోహంతో నిండిపోయింది. ఐదు గంటలకి సిఎం జగన్మోహన్‌రెడ్డి సభ ప్రాంగణానికి చేరుకున్నారు. బస్సు యాత్ర పొదిలి పట్టణంలోకి ప్రవేశించే ముందు విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేయడంతో ప్రజలు అంధకారంలోనే జగన్ కోసం ఎదురుచూశారు. ఒకవైపు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో నిరాశ చెందిన ప్రజలు జగన్ పట్టణంలో వాహనం పైకెక్కి తమను పలకరిస్తాడని భావించినా నిరాశే మిగిలింది. కరెంటు లేక పట్టణంలో జగన్ యాత్ర చీకట్లో సాగింది. పెదారికట్ల గ్రామంలో పొదిలి పట్టణానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రావణి వెంకటేశ్వర్లు జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. చిన్నారి కట్లలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బస్సు యాత్ర బందానికి భోజన వసతి కల్పించారు.

దర్శి: వైసిపి దర్శి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజంపల్లిలో సిఎం జగన్ రోడ్ షో నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్లో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి లైటింగ్ మరియు ఫ్లెక్సీలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. అనంతరం సిఎం మండలంలోని వెంకటాచలంపల్లి వద్ద రాత్రికి బసచేసే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ రాత్రికి బస చేశారు. సోమవారం ఉదయం 8:30 గంటలకు మండలంలోని వెంకటాచలంపల్లి పక్కన కురిచేడు రోడ్డులో లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.